గ్రేటర్‌పై కాంగ్రెస్ ఫోకస్!

- 24 అసెంబ్లీ సెగ్మెంట్లలో గెలుపే లక్ష్యం
- బిఆర్ఎస్, ఎంఐఎంను ఏకకాలంలో ఎదుర్కొనేలా వ్యూహరచన
- సికింద్రాబాద్ బరిలో వైఎస్ షర్మిలను దింపే యోచనలో అధిష్టానం?



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పూర్వవైభవం దిశగా పావులు కదుపుతోంది. వైఎస్ షర్మిలను నగరంలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయించి.. తద్వారా గ్రేటర్‌లో పార్టీ బలోపేతంతోపాటు రానున్న ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేలా వ్యూహ రచన చేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మొత్తం 29 శాసనసభ నియోజకవర్గాలున్నాయి. ఇందులో హైదరాబాద్‌లోనే 15 అసెంబ్లీ స్థానాలుండగా.. మేడ్చల్‌లో 5, రంగారెడ్డిలోని తొమ్మిదింటిలో రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం స్థానాలు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో 2004, 2009లో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది.. 2014లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ బలహీనపడింది. నాయకులు వెళ్లిపోతున్నా.. క్యాడర్ మాత్రం పార్టీని అట్టిపెట్టుకొనే ఉన్నారు. వారే ఇప్పుడు ఆ పార్టీకి బలం, బలగంగా మారారు. అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర, కర్ణాటకలో పార్టీ గెలుపుతో మళ్లీ తెలంగాణతో పాటు గ్రేటర్‌లో కాంగ్రెస్‌కు పునర్ వైభవం దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. నాంపల్లి, ముషీరాబాద్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, ఎల్బీనగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లో బిఆర్ఎస్‌కు ధీటుగా కాంగ్రెస్‌కు బలమైన అభ్యర్థులు ఉన్నారు. అదే సమయంలో గోషామహల్, అంబర్‌పేట్, రాజేంద్రనగర్, ఉప్పల్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో పార్టీ పటిష్టంగా ఉన్నా.. టికెట్ కోసం ఇద్దరు ముగ్గురు పోటీ పడుతున్నారు. ఇక ఎంఐఎం బలంగా ఉన్న ఏడు నియోజకవర్గాల్లోనే బలమైన అభ్యర్థులు కరువయ్యారు. ప్రతి ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థుల గెలుపులో కీలకంగా ఉన్న మైనార్టీల ఓట్లు ఈసారి కాంగ్రెస్ వైపునకు మళ్లే అవకాశమున్నా.. వారిని ఆకర్షించడానికి గట్టి నాయకత్వం లేదు. ఈ మధ్యకాలంలో ఆ పార్టీ ప్రకటిస్తున్న డిక్లరేషన్స్ ప్రజల్లోకి తీసుకుపోయి పార్టీని విజయతీరాలకు చేర్చే నాయకుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. దీన్నుంచి బయటపడేందుకు కాంగ్రెస్ అధిష్టానం వైఎస్ షర్మిల వైపు చూస్తోంది. వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేసుకుని.. ఆమెకు గ్రేటర్ ఎన్నికలు బాధ్యతలు అప్పగించే అవకాశముందని తెలుస్తోంది. అదేవిధంగా షర్మిలను సికింద్రాబాద్ నుంచి పోటీ చేయించడంతో పాటు పార్టీ అభ్యర్థులను గెలిపించే బరువు బాధ్యత కూడా ఆమెపై పెట్టనున్నారు.

అన్ని కలిసొస్తే.. ఆమె గెలుపు ఖాయం!

వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో (2009 ఎన్నికల్లో) సికింద్రాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి సినీనటి జయసుధ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇక్కడ ఇప్పటికీ వైఎస్ అభిమానులు, కార్యకర్తలతోపాటు ఓ గ్రూపు ఓట్లు కీలకంగా ఉన్నాయి. ఇక్కడి నుంచి వైఎస్ షర్మిలను బరిలోకి దింపితే సునాయాసంగా గెలిచే అవకాశం ఉందని ఆ పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు. అంతేగాక ఆమె సేవలను పాతబస్తీతో పాటు ఇతర అసెంబ్లీ స్థానాల్లోని అభ్యర్థుల గెలుపు కోసం ఉపయోగించుకోవచ్చని అంటున్నారు. కాంగ్రెస్ హైకమాండ్ కూడా అదే ఆలోచనలో ఉన్నట్టు పార్టీ నాయకులు ద్వారా తెలుస్తోంది.

విజయాలకు, అబద్దాలకు మధ్యే పోటీ

- మత్స్యకారులకు గుర్తింపుకార్డులు అందజేసిన మంత్రులు హరీశ్, తలసాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఎన్నికల్లో విజయాలకు, అబద్దాలకు మధ్య పోటీ ఉంటుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. గతంలో మత్స్యకారులకు సభ్యత్వం దొరకడం కష్టంగా ఉండేదని, ఇప్పుడు అందరూ సంతోషంగా ఉన్నారని వెల్లడించారు. ఆదివారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని 7,200 మంది మత్స్యకారులకు సహచర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి గుర్తింపు కార్డులను పంపిణీ చేసి మంత్రి మాట్లాడారు. దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గ గంగపుత్రులకు రాష్ట్రంలోనే మొదటిసారి గుర్తింపు కార్డులు సిద్దిపేటలో ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా 2 వేల కోట్ల రూపాయలతో మత్స్యకారుల సంక్షేమానికి ఖర్చు చేసిన ఏకైక నాయకుడు కెసిఆర్, బిఆర్ఎస్ ప్రభుత్వమని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో కొన్ని చెరువులలో సబ్సిడీపై చేప పిల్లలు వేసేవారని, నేడు రాష్ట్రంలోని అన్ని చెరువులలో ఉచితంగా వంద శాతం సబ్సిడీతో మనమే ఇస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

పిల్లలను సరైన మార్గంలో నడిపించాలి

- విశ్రాంత సివిల్ సర్వీస్ ఉన్నతాధికారి ముక్తేశ్వర రావు

ప్రజాశక్తి-కల్చరల్



ఉన్నత పదవులు గొప్ప స్థాయి వ్యక్తులు సమాజంలో ఎందరో కనిపిస్తారని, మంచి వ్యక్తిత్వం కలిగిన మనుషులు కొందరే ఉంటారని విశ్రాంత సివిల్ సర్వీస్ ఉన్నతాధికారి ముక్తేశ్వర రావు అన్నారు. అలాంటి సంస్కారవంతులను మంచి, దేశ, సామాజిక బాధ్యతగల వ్యక్తులను రూపొందించే శక్తి తల్లి, తండ్రి తరువాత గురువులదని ఆయన చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన మందిరంలో న్యూ ఎరా జూనియర్ కాలేజ్, అకాడమీ నిర్వహణలో తల్లిదండ్రులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ముక్తేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు జన్మరీత్యా మాత్రమే బంధం కాదని, వారిని సక్రమ మార్గంలో నడిపించడం మంచి వ్యక్తిత్వంగల పౌరులుగా రూపొందించడం, విద్య నేర్పించడం వారి.బాధ్యతని అన్నారు. కేవలం కుటుంబం కోసం కాకుండా దేశం కోసం, సమాజం కోసం కూడా పిల్లలు కషి చేసేలా తల్లిదండ్రులు, గురువు బోధించాలని సూచించారు. సంఘ్ ప్రచారకులు శ్రీధర్ లింగం మాట్లాడుతూ ఆదర్శవంతుల జీవితాలు పిల్లలకు నేర్పే ముందు తల్లితండ్రులు తమ పిల్లలకు ఆదర్శనీయులు కావాలని కోరారు. కళాశాల డైరెక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ విద్య మానసిక శక్తిని, ఆత్మ విశ్వాసాన్ని అందించేదిగా ఉండాలేగానీ, పోటీ, పోలికలు పిల్లల్లో వారిలో న్యూనతా భావం పెంచుతాయని అన్నారు.

పేదల ఇళ్ల మరమ్మతులకు రూ. వంద కోట్లు

- పురపాలక శాఖ మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతంలో జెఎన్ఎన్‌యుఆర్ఎం, వాంబే పథకాల కింద పేదలకు అందించిన ఇళ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం తరపున రూ.వంద కోట్లు కేటాయించామని, ఈ పనులను జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో పూర్తి చేస్తారని పురపాలక శాఖ మంత్రి కె తారక రామారావు తెలిపారు. ఆదివారం జిహెచ్ఎంసి పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలతో కెటిఆర్ సమావేశం నిర్వహించారు. ఇందులో పేదలు నివసించే ఈ కాలనీల్లోని ఇళ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం అందిస్తే బాగుంటుందని మంత్రికి ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసి పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని రూ.9100 కోట్లతో నిర్మించి పేదలకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. అలాగే, కొన్ని నిధులతో వేల సంఖ్యలో పేదలకు లబ్ది చేకూరుతుందంటే ప్రభుత్వం ఏమాత్రం వెనకాడదని తెలిపారు. ఈ అంశాన్ని వెంటనే ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకువెళ్లి రూ.వంద కోట్ల నిధులను పేదల ఇళ్ల మరమ్మతుల చేపట్టే విధంగా చూస్తామన్నారు. నగరంలో జంగంమెట్, బండ్లగూడ వంటి పలు ప్రాంతాల్లో జెఎన్ఎన్‌యుఆర్ఎం, వాంబే, తదితర కాలనీల్లో ఈ పనులు చేయనున్నట్టు తెలిపారు. కొన్నేళ్ల కిందట నిర్మాణమైన ఇళ్లు దెబ్బతిని ఉన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇందుకు అవసరమైన నిధులను హెచ్ఎండిఎ జిహెచ్ఎంసికి అందిస్తుందని, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ సిబ్బంది ఇందుకు సంబంధించిన మరమ్మతు పనులు పూర్తిచేస్తారని తెలిపారు.

జాతీయ సమైక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి
బిఆర్ఎస్ శ్రేణులకు కెటిఆర్ పిలుపు

సెప్టెంబర్ 17న జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించాలని, పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భారత సమాఖ్యలో విలీనమైన 17న జాతీయ సమైక్యత దినోత్సవంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు జరుపుకుంటున్నా రన్న కెటిఆర్, ఆ రోజును ఘనంగా ఎక్కడికి అక్కడ సంబురంగా నిర్వహించుకోవాలన్నారు. సిఎం కెసిఆర్ స్వయంగా హైదరాబాద్ నగరంలో జరిగే వేడుకల్లో పాల్గొంటారని, ప్రభుత్వమే పెద్ద ఎత్తున ప్రతి జిల్లా కేంద్రాలలో నిర్వహించే సంబరాలకు మంత్రులు పాల్గొని జాతీయ జెండాను ఎగురవేస్తారన్నారు. దీంతోపాటు భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ జాతీయ సమైక్యతా దినోత్సవాల్లో పాల్గొనాలని కెటిఆర్ కోరారు.

దేశానికే ఆదర్శంగా నిలిచేలా..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పది సంవత్సరాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జోడెద్దులుగా తీసుకువెళుతూ దేశానికే ఆదర్శంగా నిలిచేలా వినూత్నమైన కార్యక్రమాలతో అభివృద్ధిలో అగ్రగామిగా కెటిఆర్ అన్నారు. అయితే, తెలంగాణ అభివృద్ధిని ఓర్వలేని రాజకీయ పార్టీలు ప్రతి అంశాన్ని రాజకీయం చేసే దుర్బుద్ధితో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజలు సంబరంగా జరుపుకునే జాతీయ సమైక్యత దినోత్సవంపై కొన్ని పార్టీలు రాజకీయాలు చేసే కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రతి అంశానికి మతాన్ని జోడించి సమాజంలో చిచ్చుపెట్టే విచ్ఛిన్నకర శక్తుల కుట్రలను ప్రజలు గమనించి జాగ్రత్తగా ఉండాలన్నారు. 1948 సెప్టెంబర్ 17న సువిశాల భారతదేశంలో తెలంగాణ అంతర్భాగంగా మారిన రోజని, రాచరిక పరిపాలన నుంచి ప్రజాస్వామ్య దశలోకి పరివర్తన చెందిన రోజన్నారు. రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామిక స్వేచ్ఛ వైపు పరివర్తన చెందడానికి యావత్ తెలంగాణ సమాజం అద్భుతంగా కృషి చేసిన మహోజ్వల సందర్భం అందరికీ గుర్తుంటుందన్నారు.

ఉజ్వలమైన చరిత్రను వక్రీకరించి మలినం చేసే ప్రయత్నం..

జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచే సెప్టెంబర్ 17 సందర్భాన్ని సైతం వక్రీకరించి, తమ సంకుచిత స్వార్థ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవాలనే ఎత్తుగడలకు విచ్ఛిన్నకర శక్తులు పాల్పడుతున్నాయని కెటిఆర్ ఆరోపించారు. ఆనాటి చరిత్రతో, పరిణామాలతో సంబంధమే లేని అవకాశవాదులు, చిల్లర రాజకీయాలతో ఉజ్వలమైన తెలంగాణ చరిత్రను వక్రీకరించి మలినం చేసేందుకు ప్రయత్నం చేస్తూనే ఉన్నాయన్నారు. అత్యంత మేధో సంపత్తితో, క్రియాశీలతతో చురుకుగా స్పందించే తెలంగాణ సమాజం.. అదే చైతన్యాన్ని ప్రదర్శించి.. తెలంగాణ జీవనాడిని కలుషితం చేయాలని చూస్తున్న విచ్ఛిన్నకర శక్తుల కుటిల యత్నాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

సహజ వనరులపై కార్పొరేట్ల దురాశ

- బిజెపి రాజకీయ అండదండలే.. మణిపూర్ జాతుల ఘర్షణకు ప్రధాన కారణం
- సిపిఐ పార్లమెంటరీ పార్టీ నాయకులు బినోయ్ విశ్వం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సహజ సంపద, వనరుల లూటీ చేయాలనే కార్పొరేట్ దురాశకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అందిస్తున్న రాజకీయ అండదండలే మణిపూర్ జాతుల మధ్య ఘర్షణలకు ప్రధాన కారణమని సిపిఐ పార్లమెంటరీ పార్టీ నేత, బినోయ్ విశ్వం అన్నారు. మణిపూర్ తల్లులు, సోదరీమణులతో దేశమంతా ఉన్నదని ప్రధాని మోడీ పార్లమెంటులో ప్రగల్భాలు పలికారని, కాని ఇప్పటి వరకు ఆ రాష్ట్రంలో ఒక్కసారైనా పర్యటించలేదని విమర్శించారు. బిజెపి కుటిల, సంకుచిత రాజకీయాలకు మణిపూర్ ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారని, అక్కడ హింసకు ముగింపు ఎప్పుడో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశాలాంధ్ర పూర్వ సంపాదకులు సి రాఘవాచారి జయంతిని పురస్కరించుకొని రాఘవాచారి ట్రస్ట్, నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధనా కేంద్రం, సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో శనివారం 'మణిపూర్-ఒక రాజకీయ విశ్లేషణ' అనే అంశంపై సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో బినొయ్ విశ్వం మాట్లాడుతూ మణిపూర్ ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రధాని మోడీ అనేక దేశాలలో పర్యటించారే తప్ప మణిపూర్ మాత్రం వెళ్లలేదన్నారు. చివరకు పార్లమెంటులో అవిశ్వాస పరీక్షపై చర్చకు మోడీ సమాధానమిస్తూ మణిపూర్ కోసం భారతదేశం ఉన్నదని ప్రకటించారని, కనీసం ప్రచారం కోసమైన పార్లమెంటు సమావేశాల మరుసటి రోజు మణిపూర్ వెళ్లి వస్తారని భావించామని, కాని వెళ్లలేదన్నారు. మణిపూర్ జరుగుతున్నది కేవలం ఆర్థిక, సాంస్కృతిక, జాతుల సంఘర్షణ మాత్రమే కాదని, వీటి వెనుక కార్పొరేట్ ధన దాహం ఉందని విమర్శించారు. ఆదివాసీ ప్రాంతాలైన మణిపూర్ కొండల్లో ఉన్న అపారమైన ఖనిజ సంపదపై అదానీ కన్నుపడిందన్నారు. అందుకే ఆయనకు లాభం చేకూర్చేందుకు బిజెపి ప్రభుత్వాలు జాతుల ఘర్షణకు తెరలేపాయన్నారు. ఆ రాష్ట్రం గాయాలతో రక్తమోడుతోందని, ఇవి ఎప్పుడు అంతమవుతాయో అనేది ఇప్పటికీ ప్రశ్నలాగే మిగిలిపోయిందన్నారు. ఇరు జాతులు కూడా బిజెపిపై విశ్వాసం కోల్పోయారని అన్నారు. బిజెపి ప్రభుత్వం మోసం చేసిందని, సిఎం ఘర్షణలను నిరోధించడంలో విఫలమయ్యారని ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు. గతంలో కుకీలు, మైతీలు ఘర్షణ పడినా , కొద్ది రోజులకు సమసి పోయి కలిసిపోయేవారనీ, ఇప్పుడు బిజెపి కుటిలత్వం కారణంగా ఘర్షణలకు ఎప్పుడు ముగింపో కూడా తెలియడం లేదని విశ్వం అన్నారు. మణిపూర్ ప్రభుత్వం నడుపుతోంది సహాయక శిబిరాలు కావని, శరణార్థుల శిబిరాలు అని, స్వంత దేశంలోనే మణిపూర్ వాసులు శరణార్థులలాగా దుర్భరంగా బతుకులీడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దేశానికి మణిపూర్ ఒక హెచ్చరిక లాంటిదని, ప్రజలంతా ఏకమై దేశ ఐక్యతను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను చెబుతోందన్నారు.

ప్రతిపక్షాల ఐక్యతతోనే తెరపైకి 'భారత్'

బిజెపికి విచ్ఛిన్నకర విధానాలకు వ్యతిరేకంగా 28 రాజకీయ పార్టీలు 'ఇండియా' పేరుతో కూటమిగా ఏర్పడ్డాయని, దీంతో బిజెపి ప్రభుత్వం ఏకంగా భారతదేశ పేరును ఇండియా నుండి భారత్ మార్చాలని చూస్తున్నది బినొయ్ విశ్వం విమర్శించారు. దశాబ్దాలుగా భారతదేశాన్ని ఇండియా అని పిలుస్తున్నారని, అదే సమయంలో భారత్ అని కూడా అంటున్నారని, ఈ రెండు పేర్లలో దేనితోనైనా పిలవొచ్చన్నారు. ప్రతిపక్ష కూటమి పేరు ఇండియా ఉండడంతో పాటు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ఇష్టానుసారం భారత్ అని మార్చేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కార్ ఉన్న మణిపూర్ నిత్యం ఘర్షణ మంటలు ఆరడం లేదని విమర్శించారు. మణిపూర్ నుండి, బర్మ, నేపాల్ సరిహద్దుల మధ్య కంచలు కూడా లేవన్నారు. గతంలో తాను మణిపూర్‌కు వెళ్లినప్పుడు అక్కడి పరిస్థితులను చూసి నిర్ఘాంతపోయానని తెలిపారు. కనీసం రవాణ, రహదారుల సౌకర్యం లేదని, పరిశ్రమలు కూడా లేవని వివరించారు. గతంలో అక్కడ వ్యక్తిగతంగా మాత్రమే ఘర్షణ వాతావరణం ఉండేదని, ఇప్పుడు రెండు జాతుల మధ్య ఘర్షణలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాఘవాచారి సంపాదకీయాలు అద్భుతంగా, విశ్లేషణాత్మకంగా ఉండేవని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐజెయు అధ్యక్షులు కె శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్ (ఐడిపిడి) ఉపాధ్యక్షులు డాక్టర్ రజినీ తదితరులు పాల్గొన్నారు. సభకు రాఘవాచారి ట్రస్టు ట్రస్టీ బుడ్డిగ జమిందార్ అధ్యక్షత వహించగా, డాక్టర్ అనుపమ ట్రస్టు కార్యకలాపాలను వివరించారు. మాజీ ఎమ్మెల్సీ పిజె చంద్రశేఖర్ రావు వందన సమర్పణ చేశారు.

కాళోజీ రవికుమార్ మరణానికి కిషన్‌రెడ్డి సంతాపం

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ప్రజాకవి కాళోజీ నారాయణరావు కుమారుడు రవికుమార్ మరణం పట్ల బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కాళోజీ జయంతి, తెలంగాణ భాషాదినోత్సవాన్ని జరుపుకున్న విషయం మరిచిపోకముందే ఇలా జరగడం బాధాకరమని అన్నారు. రవికుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

15న ఆర్‌టిసి కార్మికుల నిరసన

- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి : జెఎసి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

టిఎస్‌ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడానికంటే ముందే కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15న నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలపాలని టిఎస్‌ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. ఆదివారంనాడిక్కడి టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీస్‌లో జెఎసి సమావేశం జరిగింది. చైర్మన్ కె రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కన్వీనర్ విఎస్ రావు, నాయకులు ఎమ్ఎన్ మంగ, కె రాంరెడ్డి, పి రవీందర్ రెడ్డి, జి రాములు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలు, యునిట్లలో డిమాండ్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్మికులకు అనుకూలమైన సమయంలో 'ధర్నా' చేయాలని తెలిపారు. అప్పటికీ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించనిపక్షంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆర్‌టిసి కార్మికులకు 2017 నుంచి రావలసిన వేతన సవరణను ఆ నాటి బేసిక్ పేకు 31.1 శాతం డిఎను కలిపి 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ జరపి, పాత బకాయిలతో కలిసి చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే 2021 వేతన సవరణ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమానంగా చేస్తూ మాస్టర్ పే స్కేల్‌లో ఫిక్సేషన్ చేయాలని డిమాండ్ చేశారు. 2013 వేతన సవరణ 50 శాతం బకాయిల బాండ్ల డబ్బులు ఇప్పటి వరకూ ఇవ్వలేదనీ, వాటిని 8.75 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని కోరారు. ఈ ఏడాది జనవరి, జులై మాసాల్లో రావల్సిన డిఏలు, మొత్తం 9 డిఏల బకాయిల సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. సీసీఎస్‌కు అసలు, వడ్డీ కలిసి యాజమాన్యం రూ.1,078 కోట్లు ఇవ్వాలనీ, వాటితో పాటు ఎస్‌ఆర్‌బీఎస్ రూ.540 కోట్లు, పీఎఫ్ రూ.1,270 కోట్లు, ఎస్‌బీటీ రూ. 140 కోట్లు చెల్లించాలని చెప్పారు. రిటైర్ అయిన కార్మికులకు చెల్లించాల్సిన టెర్మినల్ బెనిఫిట్స్ తక్షణం చెల్లించాలని కోరారు.

బిఆర్ఎస్‌తోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు : మంత్రి సబితా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వస్తేనే ప్రజలకు ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధికి చెందిన మైనార్టీ ఉపాధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, యూత్ ఉపాధ్యక్షుడు హుస్సేనీ, బాదర్ ఆధ్వర్యంలో వివిధ కాలనీ, బస్తీలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం మంత్రి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిఎం కెసిఆర్ అన్ని వర్గాల సంక్షేమంతోపాటు మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివద్ధి సాధిస్తుందని అన్నారు. రూ.వందల కోట్ల వ్యయంతో జరుగుతున్న అభివద్ధి పనులతోపాటు ఇటీవల జల్‌పల్లి మున్సిపాలిటీకి రూ.25 కోట్లు రోడ్ల అభివృద్ధికి సిఎం ప్రత్యేక నిధులు సమకూర్చారని తెలిపారు. బిఆర్ఎస్‌లో చేరిన ప్రతి కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పని చేయాలని సూచించారు. పార్టీలో పని చేసే వారికి సముచితస్థానం కల్పిస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రతిపక్షాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు.

నిశంత్ కథలు దేశ సంస్కృతుల మధ్య సంఘర్షణకు దర్పణం

- సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్

ప్రజాశక్తి-కల్చరల్

దేశాల సంస్కతులు, సామాజిక సంబంధాల మధ్య జరిగే ఘర్షణను రచయిత నిశాంత్ ఇంజమ్ శక్తివంతమైన కథలుగా మలిచారని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ అన్నారు. ఆదివారం నాడు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో నిశాంత్ ఇంజమ్ రాసిన 'ది బెస్ట్ పాజిబుల్ ఎక్స్‌పీరియన్స్' "కథల సంపుటిని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాలలో స్థిరపడిన వారి సంఘర్షణలను, అస్తిత్వవేదనను ఆంగ్లంలో అద్భుతంగా కథలుగా అందించారని అన్నారు. నిశాంత్ కథల సంపుటి ద్వారా తెలంగాణ ప్రాంత చైతన్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. అమెరికాలో నివసిస్తున్న నిశాంత్ తెలంగాణ నేలతో తన అనుబంధాన్ని, అనుభూతులను, విదేశీ అనుభవాలను కథలుగా రాశారని తెలిపారు. భవిష్యత్‌లో మన దేశానికే పేరు తెచ్చే ప్రఖ్యాత రచయితగా ఎదుగుతారన్న విశ్వాసాన్ని జూలూరు వ్యక్తం చేశారు. నిశాంత్ రాసిన 'ది బెస్ట్ పాసిబుల్ ఎక్స్‌పీరియన్స్' పుస్తకంపై పలువురు సాహితీవేత్తలు ముఖాముఖి చర్చ జరిపారు.



విద్యా రంగ పరిరక్షణకు పోరాటాలు

- 29 అంశాలపై తీర్మానాల ఆమోదం
- జయప్రదంగా ముగిసిన ప్లీనరీ
- రాబోయే కాలంలో సమరశీల పోరాటాలు
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యా రంగ పరిరక్షణ, విద్యార్థుల సమస్యలపై పోరాటాలు నిర్వహించేందుకు భవిష్యత్ కర్తవాలను రూపొందించినట్టు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు ఆదివారం జయప్రదంగా ముగిశాయి. మూడో రోజు ప్రతినిధుల సభలో నాగరాజు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగిన ప్లీనరీ సమావేశాలు విద్యా రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించిన 29 తీర్మానాలను ఆమోదించినట్టు తెలిపారు. యూనివర్సిటీలు, సంక్షేమ, గురుకుల హాస్టళ్లు, ప్రభుత్వ స్కూల్స్ సమస్యలు, విద్యార్థినుల రక్షణ, ప్రయివేట్ విద్యా సంస్థల ఫీజుల నియంత్రణ, నూతన జాతీయ విద్యా విధానం రద్దు వంటి అంశాలపై చర్చించినట్టు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.5177 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు చదువుల్ని మధ్యలోనే ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా రాష్ట్రంలో ఉన్న సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో నెలకొన్న సమస్యల్ని వెంటనే పరిష్కరించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలతో పాటు ఓసీల్లోని పేద విద్యార్థులు చదువుతున్న హాస్టల్స్, గురుకుల విద్యార్థులకు పెంచిన మెస్ ఛార్జీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ మార్చిన మెనూ అమలు కావడంలేదన్నారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలని, ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా నిర్ణయాలు చేయాలని, రాష్ట్రంలో ఎన్ఈపీని అమలు చేయకూడదని సూచించారు. విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ రాబోయే కాలంలో సమరశీలంగా ఉద్యమాలు నిర్వహించేలా భవిష్యత్ కర్తవ్యాల్ని రూపొందించినట్టు తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటాలు చేస్తుందన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు మూడు రోజుల పాటు జయప్రదంగా నిర్వహించిన ఆహ్వాన సంఘం కృషిని అభినందించారు. రాష్ట్ర కమిటీలో పనిచేసిన కొందరు రిలీవ్ కాగా ఉద్యమ అవసరాల రీత్యా కొత్తవారిని రాష్ట్ర కమిటీలోకి తీసుకోవడం జరిగిందన్నారు. సమావేశాల్లో రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర నాయకులు పూజ, రజినీకాంత్, దాసరి ప్రశాంత్, సంతోష్, కిరణ్, అశోక్‌రెడ్డి, కమ్మంపాటి శంకర్, రాజు, నల్లవల్ల రమేష్, ఎర్రోళ్ల సతీష్, అరవింద్, సాక్షి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే కొడంగల్ అభివృద్ధి

- ఎందుకు రెవెన్యూ డివిజన్ చేయలేదు
- విజయభేరి సభకు భారీగా తరలిరండి : రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని టిపిసిసి అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్న బీఆర్ఎస్ నేతలు ఐదేండ్లలో ఏం చేశారని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కొడంగల్ నియోజకవర్గం బొమ్రాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన పలువురు బిజెపి, బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరారు. కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ కొడంగల్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని చెప్పిన మంత్రి కెటిఆర్ నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. తన హయాంలో తీసుకొచ్చిన ఏ ప్రాజెక్టులను బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పడావు పెట్టారనీ, బొమ్రాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాల్లో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. వికారాబాద్-తాండూర్ రైల్వే లైన్‌కు ఇప్పటికీ మోక్షం లభించలేదని ఎద్దేవా చేశారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి మాట అటుంచితే నియోజకవర్గాన్ని రెండు ముక్కలు చేసి రెండు జిల్లాల్లో కలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న, చిన్న ప్రాంతాలను రెవెన్యూ డివిజన్లుగా మార్చిన ప్రభుత్వం కొడంగల్‌ను ఎందుకు రెవెన్యూ డివిజన్ చేయలేదని ప్రశ్నించారు. ఓట్ల కోసం వచ్చే బిఆర్ఎస్ నేతలను కొడంగల్‌కు ఏం చేశారో నిలదీయాలన్నారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గాలకు ఎక్కువ నిధులు కేటాయించి అభివృద్ధి చేసుకుంటున్నారని చెప్పారు. సిఎం కెసిఆర్, మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు కేవలం ఆ మూడు నియోజకవర్గాలకే సిఎం, మంత్రులుగా పనిచేస్తున్నారని విమర్శించారు. కొడంగల్ రాష్ట్రంలో భాగం కాదా? అని ప్రశ్నించారు. కొడంగల్‌గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని, అప్పుడే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించే గౌరవం కొడంగల్‌కు దక్కిందని చెప్పారు. ఈనెల 17న సోనియాగాంధీ తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో జరిగే విజయభేరిలో ఐదుగ్యారంటీలను ప్రకటించనుందని తెలిపారు. విజయభేరి సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని రేవంత్ పిలుపునిచ్చారు.

బిజెపిని ఓడించడమే సిపిఎం లక్ష్యం

- కమలం పంచన చేరడానికి కెసిఆర్ ప్రయత్నాలు
- ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం
- పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశాన్ని, ప్రజలను మోసం చేస్తున్న మతోన్మాద బిజెపి, దాని మిత్రపక్ష పార్టీలను ఓడించడమే సిపిఎం లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టంచేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తిలోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డితో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి సిపిఎం కార్యకర్తలు ఎర్రజెండాలు చేత పట్టి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో తమ్మినేని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఘటన చాకలి ఐలమ్మ పోరాటమని తెలిపారు. సెప్టెంబర్ 17న నైజాం సర్కార్ కూలిపోయిన దినం సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చరిత్రను, తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ హిందూ ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా ప్రచారం చేస్తోందని విమర్శించారు. అందుకే 17వ తేదీని బిజెపి విమోచన దినంగా పరిగణిస్తారని, ఈ సందర్భంగా ఈ నెల 17న హైదరాబాద్‌లో జరిగే అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. బిజెపిని ఓడించేందుకు దేశంలో 'ఇండియా' కూటమిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బిజెపితో సిఎం కెసిఆర్ లోపాయికారి ఒప్పందం చేసుకొని ఇండియా కూటమికి దూరంగా ఉంటున్నారన్నారు. బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేస్తానని గతంలో సిఎం కెసిఆర్ ప్రకటించారని, కమ్యూనిస్టులతో మైత్రి కొనసాగిస్తామని చెబుతూనే మాట మార్చి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించగలిగే వాళ్లతో సిపిఎం స్నేహం కొనసాగుతుందని, పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టంచేశారు. ఎర్రజెండా ఆధ్వర్యంలో పేదలు భూ పోరాటాలు చేసి భూములను సాధించుకుంటే రాష్ట్ర ప్రభుత్వం పేదల భూములను లాక్కుంటుందని విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత ఎర్రజెండాదేనని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పాలకుర్తి కేంద్ర బిందువు అని, విసునూర్ దేశ్‌ముఖ్ గుండాల నుంచి ఐలమ్మ పంటను ఎర్రజెండా కాపాడిందన్నారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పేదలకు భూములు కావాలని పోరాటం చేస్తే, నేటి అధికార పార్టీ పాలకులు వందల ఎకరాల భూములను కాజేస్తున్నారని విమర్శించారు. మంచుప్పుల భూ పోరాట సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిఎం కెసిఆర్‌కు లేఖ రాస్తానని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ నేటికీ ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం పేదలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండించారు. తప్పు చేసిన వారిని క్షమించరాదని, ఎలాంటి నోటీసులు, హెచ్చరికలు జారీ చేయకుండా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో మరో భూ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, సింగారపు రమేష్, చందు నాయక్, జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల నాయకులు బెల్లీ సంపత్, మాసంపెల్లి నాగయ్య, అశోక్ బాబు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఏదునూరి మదర్ తదితరులు పాల్గొన్నారు.


ఐలమ్మ విగ్రహం వద్ద అభివాదం చేస్తున్న తమ్మినేని

హైదరాబాద్‌లో భారీ వర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్, సోమాజిగూడ, అమీర్‌పేట, సనత్‌నగర్, సికింద్రాబాద్, బేగంపేట, చిలగూడ, బోయినపల్లి, అడ్డగుట్ట, ప్యారడైజ్, ప్యాట్నీ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు నిలిచింది. తార్నాక, నాచారం, ఉప్పల్, మేడిపల్లి, నాంపల్లి, ఆబిడ్స్, కోఠి, అఫ్జల్‌గంజ్, ఖైరతాబాద్, అంబర్‌పేట, నల్లకుంట, కాచిగూడ, గోషామహల్, మలక్‌పేట, చాదర్‌ఘాట్‌లో భారీగా ట్రాఫిక్ జాం అయింది. వర్షం కారణంగా రోడ్లపై వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, జనగాం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు సూచనలున్నాయని, మరికొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వానలు పడే సూచనలున్నాయని అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. సోమవారం నుంచి బుధవారం వరకు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయని చెప్పింది. గురువారం నుంచి శుక్రవారం వరకు అక్కడక్కడ భారీ వర్షాలుపడుతాయని చెప్పింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

తెలంగాణ సాయుధ పోరాటం అజరామరం..

- ఉద్యమ స్మృతుల చిత్ర ప్రదర్శనను ప్రారంభించిన విద్యాసాగర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అజరామరం... అది విముక్తి ఉద్యమాలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని హైకోర్టు సీనియర్ న్యాయవాది జి విద్యాసాగర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఘట్టాలను తెలియజేసే ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మొత్తం వందకుపైగా ఫొటోలను, పోరాట ఘట్టాలను కళ్లకు కట్టినట్టుగా వీక్షకులను ఆకర్షించే విధంగా ఏర్పాటు చేశారు. రజాకార్ల అకృత్యాలు, సర్దార్ వల్లభాయి పటేల్ సైన్యాల దారుణాలు, వీరుల పోరాట పటిమను ఆ చిత్రాలు సాక్షాత్కరింపచేశాయి. కుల, మతాలకు అతీతంగా భూమి, భుక్తి, విముక్తి పోరాటంలో అసువులు బాసిన వీరనారి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, బందగి, మఖ్దూం మోహినుద్దీన్, షోయబుల్లా ఖాన్, బీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, దేవులపల్లి వెంకటేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణ రెడ్డి లాంటి యోధులు.. రాచరికంపై మట్టి మనుషులతో తుపాకులు పట్టించిన తీరు ఆ చిత్రాల ద్వారా విధితమవుతోంది. ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన విద్యాసాగర్ ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నర్సింహారావు, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్, సీనియర్ నాయకులు జి రఘుపాల్, ఎం దశరథ్, మారన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో జనసేవాదళ్

- సంఘపరివార్ శక్తులు రెచ్చిపోతున్నాయి
- జాతీయస్థాయి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామ్య పరిరక్షణ, మతోన్మాద శక్తులను నిలువరించాలంటే జనసేవాదళ్ కార్యకర్తలు ముందు వరుసలో నిలవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలో సిపిఐ జనసేవాదళ్ జాతీయ శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జన సేవాదళ్ కార్యకర్తలతో కలిసి పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్యుల ఆస్తుల పరిరక్షణ, భూపోరాటాలు, మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు చండ్ర రాజేశ్వరరావు జన సేవాదళ్‌ను ఏర్పాటు చేశారని, నాలుగు దశాబ్దాల కాలంలో దేశవ్యాప్తంగా జనసేవాదళ్ చారిత్రక కార్యక్రమాలను నిర్వహించిందని తెలిపారు. దేశంలో జన సేవాదళ్ కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ దాని అనుబంధ సంస్థలు ప్రజల మధ్య మత చిచ్చును రేపుతున్నాయని, దాన్ని ఎదుర్కొనే సత్తా కమ్యూనిస్టు పార్టీ, జనసేవాదళ్ కార్యకర్తలకే ఉన్నదని తెలిపారు. కులం, మతం ప్రాతిపదికన బిజెపి వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టాలని, మతశక్తులను నిలువరించాలంటే అంకిత భావంతో పాటు క్రమశిక్షణ అవసరమన్నారు. భూ పోరాటాల్లో ప్రజలకు అండగా నిలవాలని, ప్రజా ఆందోళనలో, ఉద్యమాలకు దండుగా నిలవాలని, ఆపదలో ఆదుకోవాలని, అదే జనసేవాదళ్ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా 2024లో ఢిల్లీలో లక్ష మంది కవాత్ చేసే లక్ష్యంగా ఖమ్మంలో శిక్షణ ప్రారంభమైందన్నారు. జాతీయ స్థాయి శిక్షణ ముగిసిన తరువాత, రాష్ట్ర, జిల్లా మండల స్థాయిల్లో శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. పది రోజుల పాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమానికి ఆతిథ్యమిచ్చిన ఖమ్మం జిల్లా సమితిని అభినందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, కంట్రోల్ కమిషన్ చైర్మెన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితిసభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్.కె. జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కరకుమార్, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు తాటి నిర్మల, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు లక్ష్మినారాయణ, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి బోడా వీరన్న, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

నిమ్స్‌లో చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్లు

- వారం రోజులపాటు నిర్వహించనున్న బ్రిటన్ వైద్య బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో చిన్నారులకు ఉచితంగా వారం రోజుల పాటు గుండె ఆపరేషన్లు చేయనున్నట్టు ఆస్పత్రి డైరెక్టర్ బీరప్ప ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అప్పుడే పుట్టిన వారి నుంచి, ఐదేళ్లలోపు చిన్నారులకు గుండెలో రంధ్రం, ఇతర గుండె సంబంధిత వ్యాధులు ఉంటే చికిత్స అందించనున్నట్టు తెలిపారు. బ్రిటన్ డాక్టర్ రమణ దన్నపునేని ఆధ్వర్యంలో పది మంది వైద్య బృందంతో పాటు నిమ్స్ కార్డియో థోరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు, వైద్య బృందంతో పాటు నిలోఫర్ హాస్పిటల్ వైద్యులూ ఈ ప్రత్యేక శిబిరంలో పాలుపంచుకోనున్నట్టు తెలిపారు. చార్లీస్ హార్ట్ హీరోస్ క్యాంప్ పేరుతో ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు నిమ్స్ హాస్పిటల్‌లోని మిలీనియం బ్లాక్‌లో బ్రిటన్‌కు చెందిన వైద్య బృందం ప్రత్యేక శిబిరంలో ఆపరేషన్లు చేయనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 040-23489025 నెంబర్‌లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సంప్రదించొచ్చని పేర్కొన్నారు.

అందుబాటులో యూరియా

- రైతులు ఆందోళన చెందొద్దు : మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో యూరియాతోపాటు అన్ని ఎరువులు సరిపడినన్ని ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరమని లేదని తెలిపారు. ఈమేరకు ఆదివారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, ప్రయివేటు డీలర్ల వద్ద 90వేల మెట్రిక్ టన్నులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద 41వేల మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ వద్ద 81వేల మెట్రిక్ టన్నులు, కంపెనీ గోడౌన్లలో ఆరువేల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నట్టు పేర్కొన్నారు. మొత్తం 7.57 లక్షల మెట్రిక్ టన్నుల ఇతర ఎరువులున్నాయని తెలిపారు. రాబోయే నాలుగు రోజుల్లో అందుబాటులోకి మరో 18 వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని పేర్కొన్నారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నదని హెచ్చరించారు.

మరో జావేద్ హబీబ్ హెయిర్ సెలోన్ ప్రారంభం

హైదరాబాద్

నగరంలోని కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలో జావేద్ హాబీబ్ హెయిర్ అండ్ బ్యూటీ సలోన్, మాస్టర్ ఫ్రాంచైజ్ ఆఫీస్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ సెలూన్‌ను ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ జావేద్ హబీబ్ లాంచనంగా ప్రారంభించి.. సందడి చేశారు. తమ సంస్థకు దేశంలోని 29 రాష్ట్రాల్లోని 140 నగరాల్లో 975 సెలోన్స్ ఉన్నాయన్నారు. తెలుగు రాష్ట్రాలలోని 165వ బ్రాంచ్‌ని కొండాపూర్ రాఘవేంద్ర కాలనీ వద్ద ఏర్పాటు చేశామన్నారు. నూతన సెలూన్ ప్రారంభోత్సవంలో సౌత్ ఇండియా జావేద్ హబీబ్ మాస్టర్ ఫ్రాంచైజ్ నిర్వహకులు తేజా దేవిశెట్టి, శ్రీనివాస్‌రావు, కొండాపూర్ ఫ్రాంచైజ్ పార్ట్‌నర్స్ మురళి, సంపత్, రాము పాల్గొన్నారు. "హైదరాబాద్ లాంటి మెట్రోనగరాల్లో జనాలకు మంచి అనుభవం ఉన్న హెయిర్ స్టైలిస్టులు కావాలి. పార్టీలకు వెళ్లేవారికి, వాటిలో బాగా కనిపించాలని అనుకునే వారికి జావేద్ హబీబ్ సెలూన్లు అత్యుత్తమ సేవలు అందిస్తాయి. అత్యాధునిక టెక్నలాజీలో శిక్షణ పొందారు. జావేద్ హబీబ్ సెలూన్‌లో ఉన్న సిబ్బంది అందరూ తగిన శిక్షణ పొందినవారేనని. తాము అత్యుత్తమ సేవలు అందిస్తాము" అని నిర్వాహకులు తెలిపారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కల్లుగీత కార్మికుల సంఘం నాయకులు

22న కల్లుగీత కార్మికుల మహాధర్నా

- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22న హైదరబాద్‌లోని గీత కార్మికుల మహాధర్నా నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, తాళ్లు ఎక్కే క్రమంలో ప్రమాదం జరిగి వందలాదిమంది చనిపోతున్నారని తెలిపారు. కాళ్లు, చేతులు విరిగి విగతజీవులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులకు ఒకరిచొప్పున చనిపోతున్నారని తెలిపారు. ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలనీ, సేఫ్టి మోకులు ఇవ్వాలని, ద్విచక్ర వాహనాలు అందజేయాలని పలు సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకుండా పోతుందని విమర్శించారు. 2023- 24 బడ్జెట్‌లో గీత కార్మికులకు కేటాయించిన డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 22 న జరిగే మహాధర్నాకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో గోప రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దగొని రామ్మోహన్ గౌడ్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, కెజికెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, కార్యదర్శి బూడిద గోపి, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ ఎం కృష్ణ స్వామి, సీనియర్ నాయకులు అబ్బగాని బిక్షం, పొన్నం రాజయ్య, సిహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రజాకార్ల రాక్షసకాండకు పరాకాష్ట గుండ్రాంపల్లి దురంతాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నైజాం పోలీసుల, రజాకారు మూకల అరాచకాలను ప్రతిఘటించి చరిత్రలో తన స్థానాన్ని పదిలపర్చుకుంది చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామం. ఖాసీం రజ్వీ నాయకత్వంలోని రజాకారు మూకలు ఇక్కడ క్యాంపు పెట్టి ఈ ప్రాంత ప్రజలను తీవ్రమైన ఇబ్బందులకు గురి చేశాయి. ఆ క్యాంపుపై కమ్యూనిస్టు పార్టీ ప్రజా దళాలు దాడి చేసిన సంఘటనలను ఈ ప్రాంత ప్రజలు నేటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు. రజాకార్ క్యాంపునకు సయ్యద్ మక్బూల్ అనే వాడు నాయకత్వం వహించేవాడు. గుండ్రాంపల్లిని కేంద్రంగా చేసుకుని చుట్టుపక్కల అనేక గ్రామాల్లో రజాకారు మూకలు అనేక దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతుండేవి. సూర్యాపేట తాలుకాలోని వర్ధమాను కోట గ్రామానికి చెందిన మక్బూల్ నిజాం సైన్యంలో పని చేస్తున్న సమయంలో భార్య చనిపోగా ముగ్గురు కుమారులతో గుండ్రాంపల్లిలో ఉన్న తన అక్క ఇంటికి 1938లో వచ్చాడు. ఆతర్వాత ఖాసీం రజ్వీ స్థాపించిన మజ్లిస్ ఇత్తెహదుల్ ముసల్మాన్ సంస్థలో మక్బూల్ చేరాడు. కొంత మందిని కూడగట్టి రజాకారు గుంపుగా ఏర్పాటు చేసి గ్రామాలపై పడి దోపిడీలకు దౌర్జన్యాలకు దిగుతుండేవాడు. గుండ్రాంపల్లి చుట్టు పక్కల అనేక గ్రామాల్లో ఈ రజాకారు మూకల దాడికి ప్రజలు ఊరొదిలి వెళ్లారు. గ్రామంలో గృహ నిర్మాణానికై ఇద్దరు నిండు గర్భిణీలను సజీవంగా పునాదిలోనే పాతిపెట్టించిన క్రూరుడు మక్బూల్. పరిసర గ్రామాల్లో మక్బూల్ మూక చేయని అరాచకాలు లేవని చెప్పవచ్చు.

అలాంటి మక్బూల్‌కు బుద్ధి చెప్పాలని కమ్యూనిస్టు పార్టీ గెరిల్లా దళాలు నిర్ణయించాయి. 1948 జూన్ 19వ తేదీన కోదండరామిరెడ్డి నాయకత్వాన పాటివానిగూడెం నుంచి పాలి లక్షయ్య, పాలి ఎల్లయ్య, గుండ్రాంపల్లికి చెందిన కంకలి బక్కయ్య, పలివెల గుర్నాలు, పానగంటి ఎలమంద తదితరులు మక్బూల్‌పై దాడి చేశారు. కానీ, చిన్న పొరపాటు మూలంగా మక్బూల్ తప్పించుకున్నాడు. ఈ సంఘటన అనంతరం మక్బూల్ అరాచకాలకు అంతులేకుండా పోయింది. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను తమ ఇష్టానుసారం రజాకారు మూకలు హత్యగావించి గుండ్రాంపల్లి మసీదు సమీపాన గల బావిలో వేసి చంపారు. తన అరాచకాలను వ్యతిరేకించినందుకు అమీర్ అలీ, మహబూబ్ అలీ, అబ్బాస్ అలీ, మదీన, బనిగి సాబ్‌లను హతమార్చడానికి మక్బూల్ ప్రయత్నించాడు. ఆ అరాచకాలు భరించలేక ముస్లింలయినప్పటికీ వారు మక్బూల్‌ను మట్టుబెట్టడానికి ప్రయత్నించారు.

గుండ్రాంపల్లి సమీపాన గల చిన్నకాపర్తి గ్రామానికి చెందిన పాశం పుల్లారెడ్డి రజాకార్లకు పూర్తి సహాయ సహకారాలందిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేసేవాడు. ఇది సహించలేని కోదండరామిరెడ్డి నాయకత్వంలోని గెరిల్లా దళం దాడి చేసి, పుల్లారెడ్డి తలనరికి గ్రామాల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి గుండ్రాంపల్లి రహదారి బంగ్లాకు వేలాడదీసి వెళ్లారు. దీనికి భయపడిన మక్బూల్ రాత్రికి రాత్రే గుండ్రాంపల్లి నుంచి సొమ్మును తీసుకుని పరారయ్యాడు. మక్బూల్ పారిపోయిన విషయం తెలిసిన గ్రామస్తులంతా మక్బూల్‌పై కోపంతో అతని ఇంటిని నేలమట్టం చేశారు. వెలిమినేడు గ్రామానికి చెందిన గడ్డం రామయ్య, సప్పిడి రామయ్య మక్బూల్‌కు తోడ్పడే వారు. ఆ కిరాతకులను గ్రామస్తులే చంపేశారు. మక్బూల్ వివిధ గ్రామాల నుంచి సుమారు 200 మంది వరకు తనను ఎదురించిన వారిని తెచ్చి హతమార్చి బావిలో వేశాడు. ఇలా హత్య చేయబడిన వారిలో కేవలం 26 మందిని మాత్రమే గుర్తించగలిగారు. మిగతా వారిని గుర్తించలేక పోయారు. ఈ అమరవీరుల పేరు మీద 1993 జూన్ 4వ తేదీన అక్కడ స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు.

పోరాట దివిటి చిట్యాల ఐలమ్మ

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యమ సాహసి, పోరాట దివిటి చిట్యాల ఐలమ్మ అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఐలమ్మ 35వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఉపాధ్యక్షులు కెఎన్ ఆశాలతతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మి మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన నిప్పు కణిక చాకలి ఐలమ్మ అని కొనియాడారు. కుల, మత ప్రాంతీయ విభేదాలకు అతీతంగా సాగినది తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని చెప్పారు. పేదలకు పది లక్షల ఎకరాలు పంచిన ఘనత ఆ పోరాటానికి దక్కిందని తెలిపారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో యువతి, యువకులు హక్కుల కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆమె ధైర్యం తెగువ మహిళా లోకానికి ఆదర్శనీయమన్నారు. అంతటి గొప్ప పోరాటానికి బిజెపి, ఆర్‌ఎస్ఎస్ మతం రంగు పులుముతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బత్తుల హైమావతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి శశికళ వి సుధారాణి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మస్తాన్ బి వరలక్ష్మి ఐద్వా నాయకులు కవిత తదితరాలు. పాల్గొన్నారు.

ఆమె జీవితం నేటి యువతకు స్ఫూర్తి : వినోద్‌కుమార్

తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత, తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పి, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన మంత్రుల నివాసంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, దోపిడీ, పీడన నుంచి విముక్తి కోసం జరిగిన ఆనాటి సాయుధ రైతాంగ పోరాటంలో దొరల గడీలను ఐలమ్మ గడగడలాడించిందని గుర్తు చేశారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి యావత్ సమాజం ఎప్పటికీ మరువదని, ఆమె చూపిన మార్గంలో యువత ముందుకు సాగాలని పేర్కొన్నారు.

నిరుపేదల కోసమే 'గృహలక్ష్మి'

మంత్రి జగదీష్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్ పేదలకు అందిస్తున్న వరం గృహలక్ష్మి పథకం అని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సూర్యాపేట రూరల్ మండలం యర్కారంలో చింతా రేవతి, చివ్వెంల మండలం మున్యా నాయక్ తండాలో బానోతు లింగిలకు గృహలక్ష్మి ద్వారా మంజూరైన నూతన ఇళ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇరు గ్రామాల్లో 97మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల నెరవేర్చిన మహానుభావుడు ,ఆత్మబంధువు సిఎం కెసిఆర్ అన్నారు. రాష్ట్రం లో ఇళ్లు లేని వారు ఉండకూడదు అనేదే కెసిఆర్ ఆకాంక్ష అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మి వర్తింపజేస్తామన్నారు. ముఖ్యమంత్రి మానస పుత్రిక గృహలక్ష్మి పథకమని పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకం నిరంతరం ప్రక్రియ అని స్పష్టం చేశారు. తెలంగాణలో సంపద పెంచి, పేదలకు పంచడమే సిఎం కెసిఆర్ లక్ష్యం అన్నారు. పార్టీల కతీతమైన ప్రజాసంక్షేమమే బీఆర్ఎస్ ప్రధాన ఎజెండా అని పేర్కొన్నారు. నిత్యం పేదల సంక్షేమం కోసం ఆలోచించే మనసున్న సిఎం అని కొనియాడారు. దేశంలో కాంగ్రెస్, బిజెపిలు పాలిస్తున్న రాష్ట్రాల్లో నేటికీ కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేల మీరు వేసిన ఓటు ద్వారా ఏమి వచ్చిందో ఆలోచన చేయాలని కోరారు. సొంత జాగా ఉండి ఇంటి నిర్మాణం కోసం అర్హులైన లబ్ధిదారులకు రూ.మూడు లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. పేదల కోసం పాటుపడుతున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు.

రక్తసిక్తమైన జాతీయ రహదారి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మెదక్ జిల్లా నార్సింగి మండలంలోని జాతీయ రహదారి 44 రక్తసిక్త మయింది. ఎలాంటి సూచి కలు లేకుండా మరమ్మతు కోసం నిలిపిన లారీని అతి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో కారులో ప్రయా ణిస్తున్న ఇద్దరు ఉపాధ్యా యులు అక్కడికక్కడే ప్రాణా లు వదిలారు. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహీమూద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ మండలం నార్లాపుర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పెంటపర్తి బాబురెడ్డి ఆదివారం సాయంత్రం జరగబోయే తన కొడుకు వివాహ రిసెప్షన్ ఏర్పాట్లకు అతని బంధువులు, ఉపాధ్యాయులు దోమకొండ మండలం అంబర్‌పేట్ గ్రామానికి చెందిన సరికొండ లింగారెడ్డి (50), సిద్దిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముత్యాల వెంకటరమణ రెడ్డి (56)ని వెంట తీసుకుని తన కారులో చేగుంట నుంచి రామాయంపేటకు బయలుదేరారు. రాజస్థాన్‌కు చెందిన లారీ కోడూరు నుంచి బొప్పాయి పళ్లను నింపుకుని ఢిల్లీకి బయలుదేరగా.. మార్గమధ్యలో మండలంలోని జప్తీ శినూర్ వద్ద జాతీయ రహదారి-44పై చెడిపోయిపోవడంతో మరమ్మతు కోసం ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకుండా రోడ్డుపైనే నిలిపారు. మధ్యాహ్నం 3.30 ప్రాంతంలో అతివేగంగా కారును నడిపిస్తున్న బాబురెడ్డి నిలిపి ఉంచిన లారీని గమనించక వెనుక వైపు నుంచి ఢీ కొట్టాడు. దాంతో కారు.. లారీ వెనుక వైపు కిందకు చొచ్చుకుపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాద తీవ్రత వల్ల ముత్యాల వెంకటరమణారెడ్డి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందారు. కొన ఊపిరితో ఉన్న లింగారెడ్డి, తీవ్రంగా గాయపడిన బాబురెడ్డిను వెంటనే అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లింగారెడ్డి ఆస్పత్రిలో ప్రాణాలు వదిలారు. బాబురెడ్డిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అహ్మద్ మోహీయూద్దీన్ తెలిపారు.

ఆర్ఎంపి వైద్యానికి బాలుడు బలి

- ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ ఆర్ఎంపి డాక్టర్ చేసిన తెలిసి తెలియని వైద్యానికి ఓ బాలుని నిండు ప్రాణం బలయిన ఘటన నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలో ఆదివారం జరిగింది. మృతి చెందిన బాలుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలం జాన్ తండా గ్రామపంచాయతీకి చెందిన సపావట్ రత్యా- సాలి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు జశ్వంత్ (13) ఉన్నారు. జశ్వంత్ నాంపల్లి ఆదర్శ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. కాగా, జశ్వంత్‌కు జలుబు, దగ్గు ఉందని రత్యా తండ్రి భీమ్లా నాంపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కి తీసుకెళ్లారు. దాంతో అక్కడ పనిచేస్తున్న డాక్టర్ (ఆర్ఎంపి) జశ్వంత్‌కు ఏదో ఇంజక్షన్ చేతి నరానికి ఇవ్వగా, బాలుడు క్షణాల్లోనే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దాంతో డాక్టర్ భయపడి.. బాబుకు సీరియస్‌గా ఉందని, పెద్ద ఆస్పత్రికి తీసుకువెళ్లాలని అతనే.. కారు పిలిపించి చండూరు మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ బాబును పరిశీలించి మృతి చెందాడని చెప్పడంతో.. వెంటనే ఆర్ఎంపి పరారయ్యాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు నాంపల్లి మండల కేంద్రంలోని శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ముందు ఉంచి పెద్ద బంధువులతో కలిసి బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఆర్ఎంపి డాక్టర్‌ను వెంటనే అరెస్టు చేసి చనిపోయిన బాలుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని సముదాయించి వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు పోలీసులు చెప్పారు. మృతుని తండ్రి రత్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె లచ్చిరెడ్డి వెల్లడించారు. నాంపల్లి సిఐ అనంతుల నవీన్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.